కథా నిలయం
శ్రీకాకుళం

# అప్పగింతలు

"ఇల్లు అమ్మక తప్పదు" కంపిత స్వరంతో అన్నాను.

ఉబికివస్తోన్న కన్నీళ్లు కన్పించకుండా ముఖం చాటు చేశాను. ఇలాంటి స్థితి ఎదుర్కోవలసి వస్తుందేమోనని చానాళ్ళనుంచి భయపడుతూనే వున్నాం. అయినా నామాటలు తూటాలై గుండెకి తూట్లు పొడవగా గుడ్ల నీళ్ళు కుక్కుకుని నేలమీద చతికిలబడింది అలివేలు.

"మరో దారేదీ లేదంటారా?!" కాస్త తేరుకున్నాక సన్నగా ఏడుస్తూనే అడిగింది ఇల్లాలు.

కళ్ళు తుడుచుకుంటూ తల అడ్డంగా ఊపాను.

"అమ్మాయి పెళ్లికి చేసిన అప్పులు తడిపి మోపుడయ్యాయి. వడ్డీలు రాత్రీ పగలూ కూడా పెరుగుతున్నాయి. ఇంకా అలస్యం చేస్తే అంతా ఊడ్చేస్తుందేమోనని భయంగా వుంది..."

"అమ్మాయిని మరో అయ్య చేతిలో పెట్టి మరో ఇంటికి మహాలక్ష్మిలా పంపేం. ఆ పుండు మానుపట్టకుండానే నీడనిచ్చిన ఈ ఇంటిని కూడా మరొకరి హస్తగతం..." నోరు నొక్కేసుకుంది.

"ఊరుకోవే. గుండె రాయిచేసుకోవాలి. తప్పదు. అమ్మాయి సుఖంగా వుంది. అల్లుడు బుద్ధిమంతుడు. అమ్మాయిని అపురూపంగా చూసుకుంటాడు. అంతేశాన. ఈ వయస్సులో అంతకంటే మనం కోరుకునేదేముంటుంది చెప్పు?"

"అంతేలెండి. పెళ్లీ పెట్టుపోతలూ ఎవరూ వంక పెట్టకుండా బాగా జరిగాయి. అబ్బాయిక్కూడా ఏదోదారి దొరికితే మీకొచ్చే పెన్షన్ రాళ్ళతో ఏ గుడిసెలో వున్నా మన తనువులెల్లిపోతాయి."

"అప్పుకింద ఓ లక్ష పోయినా ఇంకో లక్షా లక్షాపాతిక వేలదాకా మిగుల్తుంది. లక్షరూపాయలు ఖర్చుపెడితే అబ్బాయికి అర్బన్ బ్యాంకులో ఉద్యోగం రావచ్చంటున్నారు.."

"ఇల్లు పుణ్యమా అని అటు అమ్మాయీ ఇటు అబ్బాయీ ఓ ఒడ్డున పడితే అంతకంటే కావాల్సిందేముంటుందండీ. అలాగే కానివ్వండి ఆ పైన భగవంతుడే వున్నాడు"

"సరే, అలా వెళ్ళి బ్రోకర్‌కి చెప్పి వస్తాను"

"కాస్త టీ పెడతాను. తాగి వెళ్దురుగాని..."

"తాగాలన్పించటంలేదే"

బయటికొచ్చి కుందనపు బొమ్మలా వున్న మా ఇంటిని మా చిన్ని స్వర్గాన్ని చూస్తూ నిలబడ్డాను.

అమ్మాయి పుట్టిన అయిదేళ్ళకి కాబోలు ఈ ఇల్లు కట్టాను. స్థలం నూట పాతిక గజాలే. అప్పట్లో పిచ్చిమొక్కల్తో తుమ్మ పొదల్తో నానా బీభత్సంగా వుండేది. ఒక దారీ తెన్నూ వుండేదికాదు. అయినప్పటికీ ఈశాన్యం ముక్క అని చెప్పికొన్నాను. చవగ్గానే వచ్చిందని చెప్పాలి.

అంతా శుభ్రంచేసి శంకుస్థాపన చేశాం. కొన్ని నిమిషాలకే దేవతలు దీవిస్తున్నట్టు చిన్నగా వానజల్లు పడింది. ఎంతో శుభం అన్నారంతా.

నేనూ ఆలివేలూ కలిసి శంకుస్థాపన చేస్తోంటే మా నాన్న మా పక్కనే కూర్చుని పూజాకాండని ఆసక్తిగా చూశారు. ఎంతగానో అభినందించారు.

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా అబ్బాయ్. చాలామందికి ఇళ్ళుండొచ్చు. కానీ స్వయంగా శంకుస్థాపన చేసి తమ పేరిట పూజలన్నీ చేసి కట్టుకున్న ఇంట్లో సుఖించే అదృష్టం అతికొద్ది మందికి మాత్రమే లభ్యమయ్యే వరంరా. అది నీకు దక్కింది. నాకు చాలా ఆనందంగా వుందిరా అబ్బాయ్. నేను చెయ్యలేని పని నువ్వు చేశావు. సాధించావు. నాకెంతో గర్వంగా వుందిరా" అని పొంగిపోయారాయన.

ఆయన అన్నట్టు ఇల్లు కట్టుకోవడం అనేది ఓ గొప్ప అనుభవం. చాలా అరుదుగా లభించే మహత్తరమైన అనుభూతి.

ఆ ఇంటిలో ప్రతి ఇటుకా మేం అందించిందే. గోడలోని ప్రతి అంగుళం మేం తడిపిందే. అదీ ఇదీ అనేమిటి ఇంటిలోని ప్రతి అణువూ మా స్పర్శతో తడిసింది. మా చెమటతో పులకించింది. నేనూ మా ఆవిడేకాదు మా పిల్లలు కూడా చిట్టి చిట్టి చేతుల్తో చేతనైనంత సాయం చేశారు.

చిన్నదే అయితేనం చూడముచ్చటైన ఇల్లుకట్టాం. అదృష్టవశాత్తూ నూతిలో కొబ్బరినీళ్లు పడ్డాయి. ఇంటిముందున్న కాస్తంత ఖాళీ జాగాలో రెండు కొబ్బరి మొక్కలూ

ఒకవేప చెట్టూ నాటాం. అవి కూడా బాగా ఎదిగి మా ఇంటికో నిండుతనాన్ని చేకూర్చి పెట్టాయి.

అమ్మాయి ఎక్కడెక్కడ్నుంచో తెచ్చి పూల మొక్కలు నాటింది. బుల్లి ఉద్యానవనాన్ని సృష్టించింది. దేవుడి పూజకీ అమ్మాయి సింగారానికీ పూల కొరత రానివ్వలేదు.

ఈ ఇంట్లో గృహప్రవేశం చేసింది మొదలు నిన్నమొన్నటి వరకూ చాలా ఆనందంగా వున్నాం. ఎన్నడూ ఎలాంటి ఘర్షణలకీ ఒత్తిడులకీ ఈతి బాధలకీ లోనుకాలేదు.

ఏడాది క్రితం మంచి సంబంధం అని చెప్పి అమ్మాయికి తలకిమించి కట్నం ఇచ్చి పెళ్లిచేశాం. పెళ్లి ఖర్చులు కూడా అంచనాని మించిపోయాయి. ఆ తర్వాత చీరలూ సారెలూ పెట్టుపోతలూ పురుళ్ళూ పుణ్యాలూ - ఖర్చుమీద ఖర్చు వచ్చిపడింది. కట్నం సొమ్ము పూడ్చడానికని మొదటి సారిగా ఋణపత్రం మీద సంతకం చేశాను. ఆ తర్వాత ప్రతి ఖర్చుకీ అప్పు చేస్తూనే వచ్చాను.

అదిప్పుడు దాదాపు లక్షరూపాయలై కూర్చుంది. మూడు రూపాయల వడ్డీ మరి మాటలా. జీతం రాళ్ళతో వడ్డీ కూడా తీర్చలేనని స్పష్టమైపోయింది. మరంచేత ఋణవిముక్తుడ్ని కావడానికి మా ఏకైక స్థిరాస్తి అయిన ఇంటిని అమ్మక తప్పటంలేదు!

'తను కట్టుకున్న ఇల్లు తనే అమ్మాల్సిన దౌర్భాగ్యస్థితి ఏ గృహస్థుకీ దాపురించకూడదు - అతడు శత్రువైనా సరే!'

కళ్ళు తుడుచుకున్నాను.

భారంగా అడుగులేస్తూ ఇళ్ళు అమ్మటం కొనటం చూసే బ్రోకర్ ఆఫీసుకెళ్ళాను.

నన్ను చూస్తూనే "ఇల్లు అమ్ముతారా?" అనడిగాడు మరి నా ముఖంలో ఏం కన్పించిందో ఏమో!

అవునని తలాడించాను.

"ఇల్లు మీ పేరనే వుందా? దస్తావేజులు మీ దగ్గరే వున్నాయా? అయితే వివరాలు చెప్పండి"

వివరాలు చెప్పగా రాసుకున్నాడు.

"మీకు వచ్చేది పాడుజెయ్యనుగానీ మీరెంతకి అమ్మాలనుకుంటున్నారో చెప్పండి. ఎవ్వరికీ చెప్పనుసుమా. కేవలం అంచనా కోసమంతే"

"నువ్వోసారొచ్చి మా ఇల్లు చూస్తే బావుంటుంది బాబూ" అన్నాను బ్రోకర్‌తో.

"చూస్తాను. పార్టీలు రెడీగా వున్నారు. కేష్ పార్టీలు. చకచకా అమ్మిపెట్టేస్తాను. మీ ఇంటికి మీరెంత విలువ కడుతున్నారో చెప్పండి"

ఏం చెప్పను?

మా ఆశల ఆకాంక్షల రూపానికి మాకు సుఖశాంతులు ప్రసాదించిన గుడికి ఆనందంగా విశ్రమించడానికి చల్లని ఒడినిచ్చిన తల్లికి మా పిల్లల ఆటపాటలకి మురిసిపోయిన మా ఏకైక ఆస్తికి విలువకట్టగలనా?

"నువ్వొచ్చి చూశాక... ఎలా బాగుంటుందంటే అలా చేద్దాం బాబూ..."

అతడదోలా చూశాడు నన్ను. బహుశా పిచ్చివాళ్ళా కన్పించి వుంటాను.

"మీ ఏరియాలో రేటు ఎలా వుందో కనుక్కున్నాక నిర్ణయిద్దాం లెండి. మరి నా కమీషన్ సంగతి..." అంటూ నసిగాడు అతను.

"పద్ధతి ప్రకారం ఎలా అయితే అలాగే ఇస్తాను. నీ కష్టం వుంచుకోను"

"మీరింకేం దిగులు పెట్టుకోకండి. ఇంకెవ్వరికీ చెప్పకండి. ఎలాంటి గొడవలూ లావాదేవీలూ లేని సాఫీ బేరాల్ని తీసుకొచ్చేస్తాను. మీరు నిశ్చింతంగా వుండండి." అన్నాడు భరోసాగా.

"కాస్త మంచివాళ్ళని చూడు బాబూ. ఎన్నో ఏళ్ళుగా ఆ ఇంటికెంతో చేశాం. అది మాకెంతో చేసింది. అంచేత మంచివారికి అప్పగించాలని మా తాపత్రయం."

"అలాగే కానిద్దాం."

ఆ సాయంత్రమే బ్రోకర్ వచ్చి మా ఇల్లు చూశాడు. పరిసరాలు చూశాడు.

"కాలనీ బాగా డెవలప్ అయ్యింది లెండి. లక్షా యాభైదాకా రావచ్చు." అన్నాడతడు.

నా గుండెల్లో రాయిపడింది. వ్రతంచెడ్డా ఫలం దక్కనట్టు ఇల్లు అమ్మినా సమస్యలు తీరవా అని గుండెలు గుబగుబలాడాయి.

"రేటెలా కట్టారు? ఈ కాలనీలో సెంటు యాభైవేలు పలుకుతోంది తెలుసా? దగ్గర దగ్గర మూడు సెంట్లుంటుంది. డాబా విలువ లక్షాపాతికవరకూ వుంటుంది. ఇహ ఈశాన్యపు ప్లాటు గనుక ఇంకో పాతికవేలు కలుపుకోవచ్చు. దగ్గర దగ్గర మూడు లక్షలు విలువచేసే బిల్డింగుని పట్టుకుని లక్షా యాభై వేలంటారేమిటి?" మా అబ్బాయి కాస్త గట్టిగానే అన్నాడు.

"అహహ. నేనేమీ అనటంలేదు. మనలో మన మాటగా అంచనా వేస్తున్నానంతే. మీకొచ్చేదేమీ పాడుజెయ్యను. మీకెంత ఎక్కువ వస్తే మాకంత ఎక్కువ కమీషనొస్తుంది కదా"

"ఇద్దరి దగ్గరా గుంజుతారుకదా!"

మావాడి మాటలు విన్పించుకోనట్టే. "రేపట్నుంచే పార్టీలని పంపించేస్తాను. ఊరికే రేటు చెప్పండి గానీ నేను లేకుండా బేరాలాడొద్దు" అనేసెళ్ళిపోయాడు బ్రోకర్.

ఇల్లు అమ్మకానికి పెట్టిన సంగతి ఇరుగు పొరుగుకి తెలిసింది. 'అయ్యోపాపం' అంటూ జాలిపడ్డారు. ఇన్నేళ్ళుగా కలిసిపోయాం ఇప్పుడు దూరమవుతారా అని బాధపడ్డారు.

మర్నాటినుంచి బేరాలు రాసాగాయి.

'ఇక్కడేవో ఇల్లు బేరం పెట్టారట. ఏ ఇల్లు?' అని అడిగినవాళ్ళకి 'మా ఇల్లే' అని చెప్పలేక చెప్పేం. 'ఈ ఇల్లు అమ్మబడును' అని ఓ బోర్డుని గేటుకి వేలాడదీస్తానన్న కొడుకుని వారించి ఒప్పించే సరికి తలప్రాణం తోకకొచ్చింది.

"మీరీ కాలంలో వుండాల్సినవాళ్లుకాదు" అని వాడంటే తలొంచుకున్నాం నేనూ అలివేలూ.

ఇంటితో మాకున్న అనుబంధమేమిటో వాడికి తెలీదూ?

వాడూ లోలోన బాధపడుతూండి వుంటాడని సరిపెట్టుకున్నాం.

ఇల్లు చూస్తామంటూ చాలామందే వచ్చారు. దు:ఖాన్ని నిగ్రహించుకుంటూ అన్నీ చూపించాం. ఓపిగ్గా అన్నీ వివరించి వాటితో బాటు మా కలల్ని వివరించాం. మా గుండెచప్పళ్లు వినిపించాం.

కొందరు రేటు చాలా ఎక్కువ చెప్తున్నామన్నారు. కొందరు చిన్న ఇల్లు అని పెదవి విరిచారు. కొందరు చెట్లు నాటి స్థలం వృధాచేశారన్నారు. ఇంకొందరు ఊరికి దూరం అన్నారు.

కడకో ముగ్గురు మిగిలారు.

ఒకాయన లక్షా తొంభైకి అడిగాడు. ఇంకో ఆయన లక్షా డెబ్బైకి ఇమ్మన్నాడు. మరొకాయన ఏకంగా సిద్ధాంతిని వెంటబెట్టుకొచ్చేశాడు.

ఆ సిద్ధాంతిని గుర్తుపట్టేను.

ఆయనా ఆయన్ని తీసుకొచ్చిన పెద్దమనిషీ ఇల్లూ దిక్కులూ చూశారు. అక్కడక్కడా కొలతలు వేశారు. గోడని కొట్టి చూశారు. డాబా ఎక్కి పరిశీలించారు.

"ఊహూ. వాస్తు బాగోలేదండీ. ఈ ఇంట్లోని వాళ్ళు అప్పుల పాలవ్వక తప్పదు" అన్నాడు సిద్ధాంతి.

నాకు నవ్వూ దు:ఖమూ ఒక్కసారే వచ్చాయి.

"ఈ సంగతి చెప్పడానికి మీరింత దూరం రావాలా సిద్ధాంతి గారూ. స్థలం, పొలం, షేర్లు, నగలు-ఏమైనా చులాగ్గా అమ్ముకుంటారు. కానీ ఇంటిని మరీ తప్పనిసరి పరిస్థితుల్లో మరో గత్యంతరం లేనప్పుడే అమ్ముకుంటారు. అలాగని చెప్పి వాస్తు బాగోలేదని ఇంటిని నిందిస్తే ఎలా చెప్పండి? ఒక్క ఏడాది నుంచీ మా ఆర్థిక స్థితి దిగజారింది గానీ అంతక్రితం పదిహనేళ్ళు మాకెలాంటి ఒడిదుడుకులూ రాలేదు."

"గ్రహప్రభావం అంటే అదే మరి. ఇన్నాళ్ళూ అణగివున్నది ఇప్పుడు హఠాత్తుగా బయటపడింది. మొత్తం ఇంటినే కబళించేస్తోంది."

"అయితే ఇదంతా వాస్తుదోషంవల్ల జరిగిందంటారు"

"నిస్సందేహంగానూ"

"ఈ ఇంటి ప్లాను గీసి ఇచ్చింది వాస్తు నియమాలు చెప్పిందీ మీరేనండీ. మీకు గుర్తులేనట్టుంది. ఆనాటి కాగితాలు చూపించమంటారా?"

"అరె! నేనే వేశానా? అలా ఎలా జరిగిందబ్బా?" అంటూ చుట్టూ తిరిగి "బాత్‌రూమ్‌ని ప్రహరీగోడకన్నా ఎక్కువ ఎత్తులో కట్టమన్నానా తక్కువ ఎత్తులో కట్టమన్నానా?" అనడిగారు.

"ఎక్కువ ఎత్తులోనే"

"కానీ ఇంటి గోడకి ఆన్చి కట్టమని వుండను. నువ్వేదో కలిసొస్తుందని కట్టి వుంటావ్. ఆ దోషం ఇలా కొట్టింది. అయినా పదిహేనేళ్ళకోసారి వాస్తుమారుతూంటుంది కూడానూ. మళ్ళీ గృహవాస్తు చూపించి మార్పులూ చేర్పులూ చేస్తే చాలా దివ్యంగా వుంటుంది. అదండీ సంగతి. తూర్పు సింహద్వారం పరమశ్రేష్ఠం. ఈశాన్యంలో బావివుంది. ఈశాన్యం పెరిగింది కూడానూ. కాదంటే మార్పు చేర్పులకి పాతికవేలదాకా ఖర్చవ్వొచ్చు. దానిని దృష్టిలో వుంచుకుని మీరూమీరూ రేటు మాట్లాడుకోండి" అన్నాడు సిద్ధాంతి.

"వాస్తుదోషాల్ని సరిచెయ్యొచ్చని మా సిద్ధాంతి అంటున్నారు గనుక మీరెంతకైతే ఇవ్వగలరో చెబితే నా అభిప్రాయం చెబుతాను."

"క్షమించండి. నేను మీకు అమ్మను"

అంతా అదిరిపడి చూశారు.

"అమ్మకానికి పెట్టి అమ్మనంటారేవిటి?"

"మీకు అమ్మనంటున్నాను. మీరిహ వెళ్లొచ్చు"

ఆయనా సిద్ధాంతీ వెళ్ళిపోయారు. "నేన్చెపలేదూ. ఆ ఇంటి వాస్తు గృహస్తుచేత అలా చెప్పిస్తుంది. పతనం చేయిస్తుంది..." అంటూ ఏదేదో చెప్తున్నాడు సిద్ధాంతి!

నిస్సత్తువ ఆవరించగా కూర్చుండిపోయాను. అలివేలు పరిస్థితీ అలాగే వుంది.

"నేను చేసింది తప్పేకావచ్చు. కానీ నా ఇంటి గురించలా మాట్లాడితే నేను భరించలేను అలివేలూ. నేను చేసిన అప్పుకి నీడనిచ్చిన ఇంటిని నిందించడం ఏం సబబు చెప్పు?"

ఆమెకి నా బాధ తెలుసు. వేదన తెలుసు. భుజం రాస్తూ అనునయించింది. ఆమె ఒడిలో తల దాచుకుని ఏడ్చేశాను.

లక్షా తొంభైకి అడిగినాయన్ని తీసుకొచ్చాడు బ్రోకర్. మాటల్లో కూర్చుంటే కాస్తో విసుర్తాడు గనుక సెటిల్ చేసేద్దామన్నాడు. ఇంతకంటే పెద్ద బేరాలేం రావని పరోక్షంగా సూచించాడు.

"ఆగవయ్యా. ఇంకోసారి ఇల్లు సూసుకోనీ. మా ఆడోళ్ళు వత్తన్నారుండు" అన్నాడాయన.

ఆయన మాటా పద్ధతీ నాకు నచ్చలేదు. చాలా మొరటుగా వున్నాడు. ఇదివరకు సారా వ్యాపారం చేసేవాట్ట. ఇప్పుడలాంటి వ్యాపారాలేవో చేస్తున్నాట్ట.

వాళ్ళకి దగ్గరగా వుండటం కూడా ఇష్టంలేక దూరంగా కూర్చున్నాను. మా అబ్బాయి అలివేలూ వాళ్ళకి కుర్చీలేసి కూర్చోబెట్టారు. అతడు కాళ్ళు బార్లా జాపి కూర్చుని పెద్దగా అరుస్తున్నట్లు మాట్లాడుతున్నాడు.

రిక్షాలో ఇద్దరాడవాళ్ళొచ్చారు. ఇద్దర్లో అతడి భార్య ఎవరో లేక ఇద్దరూ అతడి భార్యలేనో తెలీలేదు. వాళ్ళు చొరవగా ఇల్లంతా తిరిగేశారు. అలివేలుతో కూడా అథార్టీ చేస్తున్నట్లుగా మాట్లాడారు.

తర్వాత ముగ్గురూ కలిసి గట్టిగానే మాట్లాడుకున్నారు. వారి భాష అర్థంకాలేదు గానీ భావం బోధపడింది. చెట్లు నరికించి రేకులు షెడ్డు దింపి ఏవేవో కార్యకలాపాలకి ఉపయోగించుకోవచ్చునుకుంటున్నారు.

కొబ్బరిచెట్లు కొడుకులకన్నా ఎక్కువ మేలు చేస్తాయంటారు. అటువంటి చెట్లని కొట్టి అమ్మాయి పెంచిన ఉద్యానవనాన్ని పీకేసి ఇక్కడ షెడ్‌వేసి .... ఊహూ - అప్పటి నా ఇంటి రూపాన్ని ఊహించలేకపోతున్నాను!

"సెప్పండి. మా ఆడోళ్ళకి నచ్చింది గనక పైనల్‌గా సెప్పేత్తన్నాను. రెండిత్తాను. కాయమేనా?" చేతివేళ్ళకున్న ఉంగరాలని సవరిస్తూ అన్నాడు.

"నేను అందామనుకున్న మాట ఆయన అనేశాడు. ఇంక ఊ అనేసెయ్యండి బజానా పుచ్చుకుని అగ్రిమెంటు రాసేద్దాం" బ్రోకరన్నాడు.

"రెండూ పాతిక్కి తక్కువైతే అమ్మను" దృఢస్వరంతో అన్నాను.

"ఏంటేంటీ-రెండూ పాతికా. ఎల్లెల్లవయ్యా. దీని బాబులాంటి ఇల్లొత్తాది" అతడు విసురుగా వెళ్లిపోతోంటే బ్రోకరేదో నచ్చచెబుతూ అనుసరించాడు. ఆడవాళ్ళు అయితే చేతులూ మూతులూ తిప్పుకుంటూ వెళ్ళారు.

"ఇది మంచి బేరం నాన్నా చుట్టుప్రక్కల అంతా వాకబు చేశాను. రెండుకిమించి రాదంటున్నారు. అతడెలాగూ రెండుకి అడిగాడు గనుక ఇంకో అయిదు వేలు ఇమ్మందాం. బేరం సెటిలైపోతుంది" అన్నాడు అబ్బాయి.

అలివేలు కూడా అదే మంచిదన్నటు చూసింది.

"బేరం నచ్చిందిగానీ వాళ్లు నచ్చలేదు. చూస్తూ చూస్తూ వాళ్లకీ ఇంటినెలా అప్పజెప్పను చెప్పు?"

"మనం అమ్ముకొంటున్నప్పుడు ఎవరు కొనుక్కుంటే మనకేం నాన్నా. మనకి డబ్బు ముఖ్యం. అంతే. మీరు మరీ సెంటిమెంటల్ ఫూల్‌లా ప్రవర్తిస్తున్నారు" నిష్ఠూరంగా అన్నాడు.

"ఈ విషయంలో ఇంకేం వినదల్చుకోలేదు."

"ఇలా అయితే మనం ఇల్లు అమ్మినట్టే. త్వరగా డబ్బు చేతికొస్తే ఉద్యోగ ప్రయత్నాలు గట్టిగా చేద్దామనుకొంటోంటే ఏదోటి వంకపెట్టి బేరాల్ని తిరగ్గొట్టేస్తున్నారు. అసలు ఇల్లు అమ్మే ఉద్దేశం మీకుందా లేదా అది తేల్చి చెప్పండి ముందు."

ఉద్రేకపడుతున్న కొడుకు వంక చూశాను.

"అమ్మాలని నిర్ణయించుకున్నాకే కదా బేరంపెట్టింది. అలాగని ఎవరికిపడితే వాళ్ళకి అమ్మెయ్యలేం కదురా. బేరం ఇవాళ కాకపోతే రేపు కుదుర్తుంది. నచ్చినవాళ్ళు మళ్ళీ తప్పకుండా వస్తారు. అర్బన్‌బ్యాంక్ ఉద్యోగం గురించి బ్యాంకు డైరెక్టర్తో మాట్లాడా్రా. ఆయన ఆ ప్రయత్నంలోనే వున్నారు.." అనునయంగా చెప్పేను.

ఆఖరి మాటలు వాడ్ని శాంతపర్చాయి. మరేమీ అనకుండా లోపలికెళ్ళిపోయాడు.

ఆ మర్నాటి ఉదయమే భార్యాపిల్లల్తో మాస్టారొచ్చారు. అంతక్రితం లక్షాదెబ్భైకి అడిగింది ఆయనే.

ఆయన బడిపంతులట. ఆవిడకూడా పొందిగ్గా వుంది. మా పూజాపీఠం చూసి మురిసిపోయింది. "ఇల్లు బొమ్మరిల్లులా బావుందండీ." అందామె భర్తతో. వారి ఆడపిల్లలిద్దరూ పూలమొక్కల్ని చూసి మురిసిపోయారు. కొబ్బరి బొండాలు తాగొచ్చ నుకున్నారు.

ఇల్లంతా కలయతిరిగి "ఇల్లు బాగా నచ్చింది నాన్నగారూ కొనెయ్యండి నాన్నగారూ" అన్నారు తండ్రికి చెరో పక్కనా చేరి.

మా అమ్మాయి గుర్తొచ్చింది. ఆ వయస్సులో ఇలాగే ఎంతో హుషారుగా వుండేది. పట్టు పరికిణి కట్టుకుని పూబాలలా తిరుగుతూండేది. ఇల్లు అమ్మకానికి పెట్టేనని తెలిసి అమ్మొద్దంటూ కన్నీటితో రాసింది. పిచ్చి పిల్ల! అమ్మటం నాకు మాత్రం ఇష్టమా? తప్పనప్పుడు మానవమాత్రుడేం చెయ్యగలడు తలొంచడం తప్ప?!

"నిన్ననే రెండు లక్షలకి అడిగి వెళ్ళేరు. ఫైనల్‌గా మీరెంతిస్తారో చెప్పండి మాస్టారూ" ఆయనంటే ఏర్పడిన సాఫ్ట్ కార్నర్తో అడిగాను.

"నేనంత తూగలేనండి. ఇల్లు మా ఇంటిల్లిపాదికీ బాగానచ్చింది. ఈ ఇంట్లో మా తనువులు సుఖంగా వెళ్ళిపోతాయన్పిస్తోంది. అందుకే మళ్ళీ వచ్చాం. నా స్థితిగతుల గురించి ముందే మనవి చేశాను. రిజిస్ట్రేషను ఖర్చులు కూడా చాలానే అవుతాయి. అంచేత ఒకటీ తొంభైకి ఇస్తే చాలా సంతోషిస్తాను"

"అవతల రెండు లక్షలకి బేరం వుండగా..."

"ఉండొచ్చు. కాదనను. కానీ అంతివ్వాలంటే నేను అప్పు చెయ్యాలి. ఇల్లు కొన్నాక అప్పుల పాలయ్యానన్న భావన నాలో కలక్కూడదని నా తపన!" అన్నాడాయన.

నా గుండెకి గాలం వేసి లాగినట్టు బాధ కలిగింది. ఒకే ఒక్క క్షణం ఆలోచించాను.

అలివేలు వంక చూశాను.

ఆమె చూపుల్లో నాకేదో భరోసా చిక్కింది.

"సరే మాస్టారూ. మీ మాటాకాదు నామాటాకాదు. లక్షా తొంభై అయిదుకి ఖాయం చేసెయ్యండి. అగ్రిమెంటుకి ఏర్పాట్లు చేసుకోండి."

ఆయనా ఆయన భార్యా మహదానందపడిపోయారు. పిల్లలు కేరింతలు కొట్టారు.

"మనం ఇక్కడికొచ్చేస్తాం. ఈ పూలు నావి. ఈ మొక్కలకి నేను నీళ్ళు పోస్తాను" అంటూ సంబరంగా పరుగులు తీశారు.

ఆవిడేమో నాకూ అలివేలుకీ నమస్కరించింది.

"పుట్టింటివారు పసుపు కుంకాల కింద ఇచ్చిన పొలాన్ని అమ్మేశాం. ఆ డబ్బుతో ఇంత మంచి ఇల్లు కొంటామనుకోలేదు. మీ మేలు జన్మలో మర్చిపోలేం బాబాయిగారూ."

"చాలమ్మా. ఆ పిలుపు చాలు. నా కడుపు నిండిపోయింది." కన్నీళ్ళు జలజలా రాలి వచ్చేశాయి. దు:ఖంలో ఆనందరేఖ!

వాళ్ళెళ్ళేక వచ్చాడు మా అబ్బాయి. సంగతి విని తాడెత్తున లేచాడు.

"ఎక్కువ బేరం కాదని తక్కువకి ఒప్పుకోవడం అమాయకత్వమా పిచ్చితనమా? మీరసలు మతి వుండే ఒప్పుకున్నారా అని?"

"నేన్నీ దృష్టిలో లోకుల దృష్టిలో అమాయకుడ్ని కావచ్చు, పిచ్చివాడ్నీ కావచ్చు. కానీ నా చిన్నారి ఇంటిని చక్కగా చూసే మరొకరికి అప్పజెప్పాలన్న నా తాపత్రయం వుందే అది మాత్రం పిచ్చిది కాదురా. ఆర్థికశాస్త్రానికందని ఆ భావాన్ని ఆ తృప్తిని వర్ణించడానికి నా దగ్గర మాటల్లేవురా"

అలివేలు వచ్చి నా కళ్ళు తుడిచింది.

ఆమెని గుండెలకి హత్తుకున్నాను.

**(స్వాతి మాసపత్రిక)**
**ఏప్రిల్ 1997**